# పండుటాకులకు తోడు నీడ

- మిట్టపల్లి శివారులో రూ.కోటితో వృద్ధాశ్రమం నిర్మాణం
- నేడు మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభం



మిట్టపలిలో ప్రారంభానికి సిద్ధంగా వృద్ధాశ్రమం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 8: కొడుకులు, కోడళ్లు, బిడ్డలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు.. అందరూ ఉన్నా వయసు మీద పడేసరికి అనేక కారణాలతో ఎందరో ఒంటరవుతున్నారు. అందరూ ఉన్నా అనథలా మారుతున్న వృద్ధుల కోసం ప్రభుత్వం భాసటగా నిలుస్తున్నది. వారిలో మానసిన ప్రశాంతత, మనోధైర్యం నింపేందుకు వృద్ధాశ్రమాలు నిర్మిస్తూ పండుటాకులకు తోడుగా నిలుస్తున్నది. ఒక వైపు కన్న కొడుకులు దూరమై.. మరోవైపు ఆర్థిక స్థోమత లేక ఆలంబన కరువై అలమటిస్తున్న అనాథ, అభాగ్యులకు అండగా ఆత్మీయ భరోసా కల్పిస్తున్నది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులో రూ. కోటి వ్యయంతో అద్భుతమైన వృద్ధాశ్రమం నిర్మించారు. దీనిని మంత్రి సోమవారం ప్రారంభించనున్నారు.

### ఆహ్లాదం పంచేలా..

అనాథ వృద్ధులకు, ఆర్థిక స్థోమత లేని, కొడుకులు చూసుకోని వృద్ధులకు కన్నకొడుకులా మంత్రి హరీశ్‌రావు మనోధైర్యాన్ని నింపుతున్నారు. ఎలాంటి దిక్కుతోచని పరిస్థితుల్లో వృద్ధులు వృద్ధాశ్రమంలో చేరుతారు. ఈ ఆశ్రమాలు వృద్ధులకు దేవాలయాలుగా మారుతున్నాయి. ఆధ్యాత్మిక చింతన.. ప్రశాంత జీవితం ఇచ్చే వృద్ధాశ్రమంలో మెడిటేషన్, యోగా శిక్షణ, ఆధ్యాత్మిక తరగతులు, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రూ. కోటితో నిర్మించిన ఈ ఆశ్రమంలో దాదాపు 100 మంది ఉండేవిధంగా 4 రూమ్‌లు, కిచెన్ డైనింగ్ హాల్‌తోపాటు అధునాతన సౌకర్యాలు కల్పించారు. ముందువైపు ఆహ్లాదకరమైన పార్క్ నిర్మించారు. వృద్ధుల్లో మానసిక ప్రశాంతత కలిగించేలా ఏర్పాట్లు చేశారు.

### సేవ చేసే భాగ్యం సంతృప్తినిస్తున్నది



కుటుంబం కోసం తమ జీవితాలను దారబోసి వయసుమల్లిన తర్వాత అనేక కారణాలతో ఎందరో ఒంటరవుతున్నారు. అలాంటి వారి కోసం మనకు చేతనైనంత సేవ చేయాల్సిన బాధ్యత ఉంది. అనాథలుగా మారిన వృద్ధులకు ఎంతో కొంత సేవ చేయాలనే ఉద్దేశంతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశాం. జీవితకాలం పిల్లలు, సమాజం కోసం ఎంతో చేసిన వారి కోసం ఎంత చేసినా తక్కువే. ఇంతటి గొప్ప సేవ చేసే సందర్భం ఎంతో సంతృప్తినిస్తున్నది. ప్రభుత్వం రూ.కోటితో నిర్మించిన వృద్ధాశ్రమం వృద్ధులకు వారి బాధలు, మానసిక ఒత్తిడిని మరిపించేలా ఆనంద నిలయంగా మారుతుంది.

**- తన్నీరు హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి**



రంగనాయకసాగర్‌లో చేప పిల్లలు వదులుతున్న జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ
- రంగనాయక్‌సాగర్‌లో చేపపిల్లలు విడుదల
- పెద్ద ఎత్తున హాజరైన మత్స్యకారులు

చిన్నకోడూరు, అక్టోబర్ 8: ఇతర రాష్ర్టాలకు చేపలు ఎగుమతి చేసే స్థాయికి మత్స్యకారులు ఎదిగారని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్ వద్ద గల రంగనాయకసాగర్‌లో ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి ఆదివారం చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. 13 లక్షల 20 వేల చేప పిల్లలు, 6 లక్షల 60 వేల రొయ్యలు సబ్సిడీపై అందించినట్లు తెలిపారు. రంగనాయకసాగర్‌తో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతున్నదని, బీడుభూములు పచ్చబడ్డాయన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కులవృత్తుల వారి జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, సొసైటీ చైర్మన్‌లు సదానందగౌడ్, కనకరాజు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు వెంకటేశం, మాజీ ఎంపీపీ రామచంద్రం, సర్పంచ్ చంద్రకళ రవిగౌడ్, ఎంపీటీసీ దుర్గారెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వేణు, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చంద్లాపూర్‌లో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

కుల సంఘాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ తెలిపారు. గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మండల పరిధిలోని చంద్లాపూర్, మైలారం గ్రామాల్లో రెడ్డి, రజక సంఘం, ముదిరాజ్ సంఘంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో గ్రామానికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని.. జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి ఎంతో ఉందన్నారు.

# ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి బాధ్యతల స్వీకరణ


చేర్యాల, అక్టోబర్ 8: టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం హైదరాబాద్ నగరంలోని బస్‌భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తన సతీమణి పద్మలతారెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర చైర్మన్‌గా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు రికార్డులపై సంతకాలు చేశారు. అనంతరం ఆర్టీసీ ఎండీతోపాటు రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుజ్జ సంపత్ రెడ్డి, చేర్యాల ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, నాయకులు మిద్దెపాక లెనిన్, సందీప్ తదితరులు ఎమ్మెల్యే రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ముత్తిరెడ్డిని అభినందిస్తున్న సంపత్‌రెడ్డి, మల్లేశంగౌడ్

# బీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

**మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నేతల చేరిక**



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 8: కుకునూరుపల్లి మండలంలోని మంగోల్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఆదివారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ యూత్ అధ్యక్షుడు అనిల్, నాయకులు భాస్కర్, గణేశ్, నాగేశ్, కుమార్, పొట్టోళ్ల మల్లేశ్ ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కనకయ్య, మాజీ సర్పంచ్ బాలనర్సు, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# కొమురవెల్లిలో భక్తుల సందడి



పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, అక్టోబర్ 8: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం కొమురవెల్లి క్షేత్రానికి దాదాపు 8వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకం, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగిరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఎల్లమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలలో మల్లన్న ఆలయ ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగా శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

# గొల్లకురుమలకు అండగా ఉంటాం

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 8: గొల్లకురుమలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ శివారులోని బండ మల్లన్న స్వామిని ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్‌తో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో గొల్లకురుమలకు అండగా ఉంటామన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బండ మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి